అందానికి గొప్ప ప్రభావముంటుంది. అందాన్ని ప్రపంచం ఆరాధిస్తుంది. అయితే, అసాధారణ సౌందర్యం, సాధారణ జీవితాన్ని సమస్యల్లోకి నడిపిస్తుందేమో!

రాత్రి పది దాటుతోంటే చదువుతోన్న పుస్తకంలో బుక్‌మార్క్ పెట్టి టేబిల్ మీద పెట్టి, దిండు సరిచేసుకుని నిద్రకి ఉపక్రమిస్తూ "అన్నట్టు చెప్పడం మరిచేపోయాను. రేపు కేంపు ఉంది. మద్రాసు వెళ్ళాలి మెయిలుకి" అన్నాడు శివరామ్.

"సరే" అంది రాగిణి చదువుతోన్న పుస్తకంలోంచి క్షణమాత్రంగా తల ఎత్తి.

# చిన్నదీపం పెద్దదీపం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు



శివరామ్ కళ్ళు మూసుకున్నాడు. రాగిణి నించి మరేమీ మాటలు రాకపోవడం అతనికి చాలా ఆశాభంగం కలిగించింది. వస్తోన్న నిద్రని రకరకాల ఆలోచనలు పారద్రోలాయి.

"ఎన్నిరోజులు?"

"ఎప్పుడొస్తారు?"

"ఉండడం ఎక్కడ?"

అని అడిగి, ఇరవయ్యోతేదీకిఎలాగేనా వచ్చేమనీ, లేకుంటే తాను కేంపుకి ఒప్పుకోననీ ఆమె అంటుందని చాలా నిశ్చయంగా అనుకున్నాడు శివరామ్. అందుకే ప్రోగ్రామ్ చివరి నిమిషంలో కాన్సిల్ చెయ్యడంగాని, లేదా, రాగిణిని కూడా తనతో తీసికెళ్ళడంగాని చేద్దామనే ఆలోచనలో ఉన్న అతనికి ఆమె పూర్తి నిర్లిప్తత ఏమీ ఆనందం కలిగించలేదు. అనవసరంగా ఆఫీసువాళ్ళని ఆమెకికూడా

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము చాలుదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA

# శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులు బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్టు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహములోని అన్నివ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P.O.,
విశాఖపట్టణము-17.

టికెట్ బుక్ చెయ్యమనీ, ఎలాగైనా మరో బెర్తు సంపాదించమనీ ప్రెస్ చెయ్యడం ఇప్పుడు తప్పుగా కనిపిస్తోంది.

ట్రాన్సిస్టర్ రేడియోలో నించి సన్నగా పాటలు వినిపిస్తున్నాయి.

పాత హిందీపాటలు. వాల్యూమ్ తగ్గించి వింటోంది రాగిణి. ఆమెకి ఉన్న వ్యామోహాలు చాలా తక్కువ. రేడియోలో సినిమా పాటలు వాటిలో ముఖ్యమైనవి. ఆ తరవాత పుస్తకాలు. రెండు మూడు లైబ్రరీల నించి తెచ్చుకుని చదువుతూ ఉంటుంది రాగిణి.

ఆమె వెడ్డింగ్ యానివర్సరీ మరిచిపోయిందేమో ?

ఇరవైన తమ వివాహం అయి సరిగ్గా రెండేళ్ళు. ఆ రోజు చక్కగా సెలబ్రేట్ చేసుకోవాలని అనుకున్నాడు తాను. కాని, రాగిణికి ఆ ధ్యాసే లేనట్టువుంది.

క్రిందటి సంవత్సరం సరిగ్గా ఆ రోజు ఒక వారంలో వస్తుందనగా ఆమె తల్లికి అనారోగ్యం చేసి రాగిణి వెళ్ళి తిరిగిరాలేకపోయింది. తాను ఆమెని ఊరడిస్తూ ఉత్తరం రాసి, ఆమె కోసం కొన్న చీర పోస్టులో పంపేడు. రాగిణి థ్యాంక్స్ చెప్తూ నాలుగు పంక్తుల జవాబు రాసింది. ఆ పరిస్థితి అలాటిది.

ఈ సంవత్సరం తాను పనిమీద వెళ్లాల్సి వచ్చేలాగ వుంది. ఆ రోజు రాగిణితో ఉండాలని ఎంతైనా వుంది అతనికి. కాని ఆ మాట ఆమె అనాలని అతని కోరిక.

రాగిణి చదువుకొంటోంది.

శివరామ్ నిద్రపోయే ప్రయత్నం చేస్తున్నాడు. కాని నిద్ర రావడం లేదు.

రేడియోలో మరోపాట వస్తోంది.

ఆ పాట విన్నప్పుడల్లా అతనికి రాగిణిని మొట్టమొదట చూసిన రోజు, పెళ్ళిచూపులరోజు జ్ఞాపకం వస్తుంది.

వాళ్ళ వూళ్ళో రాగిణికాక మరో ఇద్దరు అమ్మాయిలు వున్నారు. అందరినీ చూసి ఏదో ఒకటి నిర్ణయం చేసుకోమన్నాడు తండ్రి.

తల్లి ఏదో చెప్పబోయింది.

ఆమెని వారించాడు తండ్రి. "వాడు మనం సూచించిన పిల్లల్ని చూసి ఎవరో ఒకరిని ఎన్నుకోవడమే గొప్ప! వాడి ఉద్దేశాలు వాడికుంటాయి. నువ్వూ,నేనూ మన వూహలు వాడిమీద రుద్దడం అన్యాయం" అన్నాడాయన.

ఆ వూరుతాను,చంద్రం కలిసి వెళ్ళేరు.

ముందర కార్యక్రమం ప్రకారం ఒక అమ్మాయి యింటికి వెళ్ళేరు. ఆ యిల్లు యిప్పటికీ బాగా జ్ఞాపకం వుంది. గేటుతీసి లోపలికి వెళ్ళగానే బాడిన గుమ్మడి కాయలు కనిపించాయి.

ఇంటి యజమాని వాళ్ళకి స్వాగతం చెప్పి, కాఫీ యిచ్చి, "నా వుత్తరం అందలేదా బాబూ?" అన్నాడు.

"ఏం వుత్తరం?" అని అడిగాడు చంద్రం.

"అదే మా అమ్మాయికి మరో సంబంధం సెటిలయిందని రాశాను."

ఆయన బాధపడుతూ చెప్పేడు. తానే ఏదో పొరపాటు చేసినట్టు జవాబు ఏం చెప్పి బయటికి వెళ్ళాలని ఆలోచిస్తూంటే, "వెంటనే వుత్తరంకూడా రాశాను. వాళ్ళు రెండు నెలలనించి ఆలోచనల్లో ఉండి ఉండి హఠాత్తుగా నాలుగు రోజుల క్రిందట వచ్చి సరేనని చెప్పి వెళ్ళేరు" అంటున్నాడు ఆయన.

చిరునవ్వుతో "ఫరవాలేదు లెండి. ఉత్తరం చేరడం ఆలస్యం అయి ఉంటుంది- వెళ్ళి వస్తాం" అంటూ లేచేడు శివరామ్.

ఆయన గేటుదాకా వచ్చి మరికొన్ని క్షమాపణలు చెప్పి సాగనంపేరు. రిక్షా ఎక్కి మరో ఇంటికి వెడుతూ "మన సమస్య ఒకటి సులువుగా పరిష్కారం అయింది" అన్నాడు శివరామ్.

"చాలా ప్రాక్టికల్ మనిషివి" అన్నాడు చంద్రం నవ్వుతూ.

రెండో ఇంట్లో అందరూ తమ కోసమే ఎదురు చూస్తున్నారు. అన్న సమయానికే అక్కడికి చేరినా, కొంత ఆలస్యం అయిన ఆతృతతో ఎదురు చూస్తున్నట్టు ఉన్నారు వాళ్ళంతా.

స్వీట్సూ, టిఫినూ, అగరవొత్తులూ- అన్నీ కొంత ఆర్భాటంతో ఏర్పాట్లు చేశారు. అవన్నీ చూచాయగా జ్ఞాపకం వున్నా, బాగా జ్ఞాపకం ఉన్నది వాకిట్లో గొలుసుతో కట్టి వుంచిన అల్సేషియన్ అరుపులు. తెల్లటి అల్సేషియన్.

"కొత్త వాళ్ళని చూస్తే అది వెర్రిగా గోలచేస్తుంది" అన్నాడు కన్యాదాత.

తాను తల ఊపేడు.

ముందరి లాంఛనాలన్నీ అయాక అమ్మాయిని తీసుకొచ్చేరు.

అలంకరించిన దీపంలాగ వుంది అమ్మాయి, అందంగా చాలా చాలా అందంగా వుంది.

శివరామ్ కళ్లు చెదిరిపోయాయి.

ఆమె తల వొంచుకుని కూర్చుంది. చంద్రం తన చెవిలో ఏమన్నా అడగమని రెండుసార్లు చెప్పేక, "ఎంతదాకా చదువుకున్నారు ?" అని అడగగలిగాడు, చాలా ప్రయత్నించాక- ఎండిపోయిన గొంతుకతో.

"బి. ఏ...."

"కాస్త స్పష్టంగా చెప్పమ్మా" అని అన్నారెవరో.

"ఫరవాలేదులెండి" అని సర్దిచెప్పి. "ఎక్కడ? ఏం సబ్జెక్ట్సు?" అన్నాడు ఆమె గొంతుక వినాలని.

ఆమె చెప్పింది.

గొంతుకకూడా తియ్యగా వుంది.

"మావాడిని ఏమైనా అడగాలంటే అడగండి" అన్నాడు చంద్రం తన పాత్ర తాను నిర్వహిస్తూ.

ఆమె మృదువుగా తల వూపింది.

మరో పది నిమిషాలు పది సెకన్లలాగ గడిచిపోయాక ఆమెని లోపలికి తీసుకుని వెళ్ళిపోయారు. ఈ నాటికీ ఆమె ఆకృతి స్పష్టంగా జ్ఞాపకంవుంది. కాని ఆమెపేరు రూపానికి తగినట్టే సుందరి. ఆమె వెళ్ళిపోయాక అంతా చిన్నబోయినట్టు అనిపించింది తనకి. తానూ లేచి. "మేము వెళ్ళివస్తామండీ! నాన్నతో మాట్లాడి ఉత్తరం రాయిస్తాను" అని మాత్రం అని. చంద్రంతో వెలుపలికి వచ్చాడు.

"మిగిలిన అమ్మాయిని చూడాలా?" అన్నాడు చంద్రం.

"చూద్దాం...."

"ఈ అమ్మాయికన్నా చక్కటిది కనిపించాలంటే మనం చాలా చాలా వెతకాల్సి ఉంటుంది" అన్నాడు చంద్రం.


"సౌందర్యం ఒక్కటే కాదుగా, చూసేది?"

చంద్రం నవ్వి. "మరేమిటి?" అన్నాడు.

ఏమిటో చెప్పలేకపోయాడు శివరామ్. కాని అతని మనసులో రకరకాల ఆలోచనలు వచ్చాయి. అంత అందంగా వున్న అమ్మాయితో తన కాపురం ఎలా వుంటుందో అతను ఊహించుకొని కొంత భయపడ్డాడు. అందానికి నివేదనలు చాలా కావాలని అతనికి తెలుసును. ఆ నివేదనలు కేవలం డబ్బు కొనగలిగేవే కావనీ అతనికి అనిపించింది. సంసారంలో ఆమె తనకి భౌతికంగా తియ్యటి క్షణాలని ఇవ్వగలిగినా. హద్దులు మీరిన అందంతోబాటు అనేక సమస్యలు కూడా వచ్చి పడతాయని శివరామ్ అనుకున్నాడు. అంత చక్కటి అమ్మాయిని కాదంటే చంద్రంతోసహా చాలామంది ఆశ్చర్యపడతారు. నవ్వుతారు. కాని తన జీవితం వాళ్ళెవరూ జీవించలేరు. ముస్ముందు తన సమస్యలని పరిష్కరించమని వారెవరినీ తానూ అడగలేదు.

అలాగే ఆలోచిస్తూ చంద్రంతో మూడో ఇంటికి వెళ్ళేడు.

అక్కడ రాగిణిని చూశాక ఆమెకీ,



అందగత్తెకీ ఉన్న తేడా చాలా ప్రస్ఫుటంగా కనిపించింది. రాగిణిలో అంద వికారం ఏమీ లేకపోయినా ఆమెలో చెప్పుకోదగ్గ అందమూ ఏమీ లేదు. రాగిణి అంతగా సిగ్గు పడిపోలేదు కూడాను. తన వివరాలు చెప్పింది. అతని వివరాలు అడిగింది. చివరికి కట్నం గురించి కూడా అడిగింది. "మా నాన్న నాకు కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యాలని లేదు నాకు. కావాలంటే నేనూ ఉద్యోగం చేస్తాను" అంది.

అక్కడ చంద్రం వాళ్ళకి "ఏ విషయమూ ఉత్తరం రాస్తాం" అని చెప్పి ప్రయాణం సాగించాడు.

రైల్లో ప్రయాణం అంతా ఏ అమ్మాయిని చేసుకోవాలనే విషయంమీదనే చర్చతో గడిచింది.

"సామాన్యంగా, ఆ అప్సరసని చూశాక మరో పిల్లని చూడ్డం కానీ, చూశాక ఆలోచించడంగాని వుండదు. విచిత్రమైన మనిషివి నువ్వు- ఇంజనీరువి కదా! ఆ మాత్రం తేడా తెలీడంలేదూ?" అన్నాడు చివరికి, విసిగిపోయి చంద్రం.

శివరామ్ చిరునవ్వుతో "ఇంజనీర్లు కేవలం రూపురేఖలు చూసి నిర్ణయం చెయ్యరు. ఆలోచించినకొద్దీ అందంకన్నా ముఖ్యమైన లక్షణాలు చాలా వుంటాయని అనిపిస్తోంది. ముఖ్యంగా, పెళ్ళి చేసుకునే అమ్మాయిలో" అన్నాడు.

ఇంటికి వెళ్ళేసరికి అతని ఆలోచనలు ఓ మార్గానికి వచ్చాయి. ఉదయంనించి సాయంత్రందాకా పనితొందరలో వుండిపోయే వుద్యోగం తనది. అందాన్ని ఆరాధిస్తూ కాలంగడిపే అవకాశంలేదు తనకి. అదీకాక, ఆ అందంకోసం చాలామంది పెళ్ళి కొడుకులు యెగబడతారు. రాగిణి కోసం అంత డిమాండ్ వుండదు. తానామెని చేసుకుంటే ఆమె హృదయంలో మొట్టమొదట తనమీద సద్భావం ఏర్పడి సుఖకరమైన వైవాహిక జీవితానికది నాంది అవుతుంది.

ఆ మాటే తల్లిదండ్రులకి చెప్పేడు.

రాగిణితో అతని పెళ్ళి మరో రెండు నెలల లోపుగానే జరిగిపోయింది.

శివరామ్ కలలుగనే రకం కాదు. దాంపత్య జీవితం గురించి చూచాయగా అతనికి కొన్ని ఆలోచనలు ఉన్నా, అవి రంగు రంగుల డ్రీమ్ సీక్వెన్సులు కావు. పెళ్ళి అయిన పదిరోజులకి అతను రాగిణిని తీసుకుని తన ఉద్యోగ స్థలానికి వెళ్ళిపోయాడు.

రాగిణి వంట బాగుండడంతో అతనికి వైవాహిక జీవితం సంతృప్తికరంగా ప్రారంభించింది. ఒకరి కొకరు క్రమంగా దగ్గరపడే అనుభవాలు. అతనికి తియ్య తియ్యగా ఉంది. చిరునవ్వులు కలిగించేవి. ఆమె అంత ఎక్కువగా మాట్లాడే తరహాకాదు కాని, అలాగ అని మరీ ముభావంగానూ ఉండేదికాదు. అతనిదీ అలాటి మనస్తత్వమే కావడాన్న పెద్ద ఎగుడు దిగుడులు లేకుండానే సంసారం సాగిపోయేది. ఎప్పుడైనా సినిమాకి వెళ్ళేవారు. వారానికొకటి రెండుసార్లు అతనికి టైము ఉంటే ఏ పార్కుకో వెళ్ళేవారు. లేకపోతే ఇంట్లోనే: ఆమె రేడియో వినేది. ఇద్దరూ పుస్తకాలు చదువుకునేవారు.

పెళ్ళయిన కొత్తలో తాను వొద్దన్న అందగత్తె విషయం రాగిణి అడుగుతుందని శివరామ్ అనుకున్నాడు. కాని, ఆమె ఆ విషయం ఎన్నడూ ఎత్తలేదు. చివరికా మాట ఆమెకి తెలీనే తెలీదనే నిర్ణయానికి వచ్చాడతను. ఆ గుర్తింపు అతనిలో ఎక్కడో కొంత అసంతృప్తిని కలిగించింది. కాని తీవ్రమైన బాధ ఏమీ అతనికి కలగలేదు.

క్రమంగా వాళ్ళ జీవితం ఒక స్థాయికి వచ్చింది.

కాని, తనకే అర్థంకాని మరో లోటు అతనికి కనిపిస్తూ వచ్చింది. రాగిణి కావలసినంతగా తనకి దగ్గర కాలేదన్న ఆలోచన అతని లోలోపల బలంగా పెరగసాగింది. బయటకేమీ తెలియకపోయినా, తమ మధ్య వుండకూడని దూరం ఏదో వుంది.

సినిమాకి వెడదాం అంటే సరేనంటుంది.

పార్కుకి వెడదాం అంటే మాట్లాడకుండా తయారై బయలుదేరుతుంది.

కాని, తనకితానై ఆమె ఎప్పుడూ ఇలాటివి ప్రతిపాదించదు. తానేమైనా అంటే, ఆమెలో ప్రత్యేకం సంతోషం కలగదు. ఎప్పుడూ ఆమె హాయిగా నవ్వడంగాని, కనీసం వుండీ వుండీ ఆమె ముఖంలో చిరునవ్వుగాని అతనుచూసిన జ్ఞాపకంలేదు. మరి తన పరోక్షంలో నవ్వుతుందేమో. కాని, అదీ అనుమానమే. ఇద్దరూ కలిసి ఆనందంగా వుండే సందర్భాలలోకూడా రాగిణి అతనికోసం ఏదో చేస్తోన్నట్టు వుంటుందిగాని, తనకితానే సంతోషంగా వాటిలో పాలుపంచుకోదు.

ఆమె మనసులో ఏముందో తెలుసుకోవాలని శివరామ్ ఒకటి రెండుసార్లు ప్రయత్నించాడు. కాని ఆమెనించి సమాచారం ఏమీ రాలేదు. చాలా కరెక్ట్‌గా పోయే వుద్యోగిలాగ ప్రవర్తించింది రాగిణి.

"నేను ఎక్కడ లోటుచేశాను?" అంది అతని ప్రశ్నకి సమాధానంగా.

"నువ్వు లోటు చేశావని కాదు. నేనే ఏదైనా లోటు చేసేసేమోనని" అన్నాడు నిజం చెప్తూ శివరామ్.

తేలిగ్గా నవ్వుతూ "అలాటిదేమైనా వుంటే చెప్తాను" అంది రాగిణి.

"నువ్వు నన్ను కోరాల్సినదీ, కోరేదీ ఏమీ లేదా?" అన్నాడు శివరామ్.

"ఇప్పటికి లేవు. ఎప్పుడైనా వుంటే తప్పక కోరుతాను" అంది రాగిణి.

"నిజంగా? వాగ్దానం చేస్తావా?"

"మనమధ్య వాగ్దానాల అవసరం వస్తే వాటి ప్రయోజనం వుండదు" అంది రాగిణి గంభీరంగా.

ఆ తరవాత శివరామ్ ఆమెతో ఆ విషయం గురించి మళ్ళీ చర్చించలేదు. కాని అతని మనసులో మాత్రం సంతృప్తి లేదు. రాగిణిని గురించిన ఇలాటి ఆలోచనలు వచ్చినపుడే అప్రయత్నంగా సుందరి కూడా అతని ఆలోచనల్లో చోటు చేసుకునేది. ఆమెని ఇంకా మరిచిపోకపోవడం అతనికి ఆశ్చర్యాన్ని, కొంచెం సిగ్గునీ కూడా కలుగజేస్తూ వుండేది.

అతను అందాన్నీ, కలల్లో సాగే రొమాన్స్‌నీ, విపరీతమైన ఉద్రేకాలలోనించి కన్నీళ్ళనీ కోరుకొని రాగిణిని చేసుకోలేదు. అతను ఆశిస్తున్నదంతా ఎప్పుడేనా, ఉండి ఉంటే, ఒక వెచ్చటి స్పందన. మనసునించి మనసుకి ఒక స్పందన. అదేలేదు తన జీవితంలో.

నిట్టూర్చాడు.

"నిద్రరావడంలేదా?" అంది రాగిణి.

"లేదు ...."

"లైటు తీసెయ్యనా?"

"థేంక్స్"

గది చీకటైంది. క్రమంగా శివరామ్‌కి నిద్ర పట్టేసింది.

మర్నాడు అనుకున్నప్రకారం బయలుదేరి మద్రాసు చేరేడు. హోటల్లో దిగి, స్నానాదులు ముగించుకుని ఆఫీసుకు బయలుదేరుతుంటే మురారి కనిపించాడు. మురారిదీ అతని వుద్యోగమే. అయితే, మురారి కొచ్చిన్‌లో వుంటాడు. అతనూ తనలాగే వొచ్చాడు.

పలకరింపులయాక యిద్దరూ ఒక కారులోనే బయలుదేరి ఆఫీసుకి వెళ్ళిపోయారు. దారిలో కబుర్లు చెప్పుకుంటూంటె మురారి భార్యతో కలిసి వొచ్చినట్టు చెప్పేడు.

"మంచి పని చేశావు. నేనూ అలాగే చేద్దా మనుకుంటూనే చివరి నిమిషంలో మనసు మార్చుకున్నాను" అన్నాడు శివరామ్.

"పొరపాటు చేశావు. వాళ్ళిద్దరూ కలు

సరదాగా కాలం గడిపి వుండేవారు. ఇక్కడ బంధువులు వున్నార్లే.... కాని...." అంటూ సగంలో ఆపి. మరో విషయం గురించి మాటలాడడం మొదలుపెట్టేడు మురారి. ఏదో చెప్పబోయి ఆపుకున్నాడని తెలిసిపోయినా. ఆ విషయం గ్రహించనట్టే ప్రవర్తించాడు శివరామ్.

ఆరోజంతా చర్చలతో గడిచిపోయింది. అయిదు దాటగానే. తనకి తలనొప్పిగా ఉందని చెప్పి మురారి హోటల్‌కి వెళ్ళిపోయాడు. శివరామ్ ఏడుదాటేక వచ్చాడు. స్నానంచేసి బట్టలు మార్చుకుని అతను లాన్‌లో కొంచెంసేపు కూర్చుందామని వొచ్చేసరికి ఒకమూల మురారీ. అతని భార్యా కనిపించారు.

అప్రయత్నంగా మురారిని పలకరించేడు శివరామ్. మరుక్షణం తనని తానే చాలా నిందించుకున్నాడు.

మురారి భార్యని పరిచయంచేస్తూ. "సుందరి— మా శ్రీమతి- ఈయన శివరామ్" అనడం. పరస్పర నమస్కారాలూ - అతి యాంత్రికంగా జరిగాయి. శివరామ్ అక్కడనించి ఎలాగ త్వరగా బయటపడడం అని ఆలోచనలో పడాడు.

మురారి భార్య సుందరి.

ఆమె తాను పెళ్ళి చూపుల్లో చూసినప్పటిలాగే వుంది. రెండేళ్ళలో ఆమె ఏమీ మారలేదు. దీపంలాటి అందం. కళ్ళు తిప్పుకోడం కష్టంచేసే అందం.

మురారి ఏమిటో అంటున్నాడు.

శివరామ్ అది గ్రహించి తికమకపడుతూ. "సారీ! ఏమన్నావు?" అన్నాడు

"ఏమీలేదు కూర్చోమన్నాను."

కూర్చోగానే మురారి ఆహ్వానం కేవలం లాంఛనప్రాయం అని తెలిసివొచ్చింది అతనికి. కాని వెంటనే లేచి వెళ్ళాలనిపించలేదు. అది బాగుండదు.

"నేను - డిన్నర్ ముగించి పిక్చర్‌కి వెడదామనుకున్నాను" అన్నాడు వాచీ చూసుకుంటూ శివరామ్.

"ఏ పిక్చరుకండీ?" అంది సుందరి చనువుగా.

"సుందరికి సినిమాలంటే భలే ఇష్టం" అన్నాడు మురారి. అందులో విమర్శనా లేదు. అంగీకారమూ లేదు.

"నిర్ణయించలేదు. మౌంట్‌రోడ్‌కిపోతే ఏదో ఒకటి వుంటుంది చూడాల్సినది."

"మనమూ వెడదామండీ!" అంది సుందరి.

"నాకేం అభ్యంతరంలేదు" అన్నాడు మురారి.

శివరామ్ ఇప్పుడు రాగిణితో పాటు సినిమాకి వెడితే ఏదో సరదాగా వుండేది కాని. ఇక్కడ సినిమాకి వెళ్ళాలని లేదు. ఊరికేనే అక్కడినించి తప్పించుకోడానికి అన్నమాట అది.

కాని ఇప్పుడు వెళ్ళక తప్పదు.

"రోజంతా బోరు కొట్టింది. పదండి డిన్నర్ తీసుకుని పోదాం" అంది సుందరి.

"ఇంకా చాలా టైమ్ ఉంది" అన్నాడు శివరామ్.

"మీ మిసెస్‌ని ఉదయం బయలుదేరి రమ్మను—మన కాన్ఫరెన్స్ కనీసం రెండు మూడు రోజులింకా సాగేలా వుంది" అన్నాడు మురారి.

శివరామ్ ఆలోచనలో పడ్డాడు.

సుందరి తనని గుర్తించలేదు.... కాని. రాగిణిది ఈమె వూరేకదా! తెలిసి వాళ్ళ కబుర్లలో అసలు విషయం బయటపడితే?

చాలా త్వరగా ఆలోచించేడు శివరామ్.

"అలాగ చెయ్యండి!.... కనీసం మేమిద్దరం ఉంటాము. కబుర్లయినా చెప్పుకోవొచ్చును. ఒకసారి మహాబలిపురం వెళ్ళివస్తాము" అంది సుందరి.

"సరే! ఫోన్ చేస్తాను. వీలైతే రేపు సాయంత్రానికి వొస్తుంది" అని. రూమ్‌కి వెళ్ళి ఇంటికి టెలిఫోన్ చేశాడు శివరామ్.

రాగిణి ఇంట్లో లేదు.

"అమ్మగారు నాలుగ్గంటలకి ఎక్కడికో వెళ్ళేరు. ఇంకా రాలేదు" అన్నాడు సర్వెంటు.

అతను ఆశ్చర్యపడ్డాడు. ఎప్పుడూ ఎవరింటికీ వెళ్ళే అలవాటులేదు రాగిణికి. ఎక్కడికి వెళ్ళిందో!

"రాగానే నేను టెలిఫోన్ చేశానని చెప్పు - ఉదయం బండిలో రమ్మను. నాకు టెలిఫోన్ చెయ్యమను" అని హోటల్ నంబరూ, ఆఫీసు నంబరూ ఇచ్చి మళ్ళీ లాన్‌లోకి వొచ్చి జరిగింది చెప్పేడు.

"మనం సినిమాకి పోతే ఆవిడ టెలిఫోన్ చేస్తారేమో!" అన్నాడు మురారి.

"అవును. ఈవేళకి సినిమా కేన్సిల్ చేద్దాం. అయినా మీరిద్దరూ వెళ్ళరండి" అన్నాడు శివరామ్.

"అవునండీ! మనం వెడదామా?" అంది సుందరి ఉత్సాహంగా.

మురారి ఆమెని నిరుత్సాహపరిచాడు. "రేపు నలుగురం వెడదాము- మనం ఇంత శ్రమపడి వెళ్ళేక టికెట్లు లేవంటే బాధ. ఉదయం టికెట్స్ తెప్పించి ఉంచుతాను" అన్నాడు.

సుందరి ముఖంలో ఆశాభంగం చాలా స్పష్టంగా కనిపించింది. కాని. మురారి మారలేదు. మరో అరగంట అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుని ఎవరి గదులకి వాళ్ళు వెళ్ళిపోయారు.

టెలిఫోన్ కోసం ఎదురుచూస్తూ శివరామ్ ఆలోచనల్లో కాలం గడిపేడు- రాగిణి ఎక్కడికి వెళ్ళిందో అతనికి అంతుపట్టలేదు. ఆ వూరిలో ఆమెకి తెలిసినవాళ్లు చాలా తక్కువమంది. ఎక్కడికైనా తిరగాలనే ప్రత్యేక ఉత్సాహం లేదు ఆమెకి.

ఆ విషయంలో సుందరిలాగ కాదు రాగిణి. సుందరికి తిరగడంఅంటే యిష్టం లాగ వుంది. రోజంతా హోటల్ గదిలో కూర్చుని బోర్‌యెత్తి ఈనాడే అలాగ



ఫోన్: 76369.
మికో-మిక్స్
మీవద్ద వుంటే
మరో హస్తద్వయాన్ని
మీరు పొందివున్నట్టే

nirmala
ఆడియోవిజన్
ప్రకాశం రోడ్ * విజయవాడ-2.

సినిమా తారలు

నేటిమేటి సినీ తారలు శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు కావాలంటే 5 రూ॥లు. కేవలం ఒకే ఫొటో కావాలంటే రూపాయిన్నర. పాత కొత్త నటీనటుల, దర్శకుల, రచయితల, సినీ నిర్మాణ సంస్థల అడ్రసులు-ఫోను నెంబర్లుగల పుస్తకం కావాలంటే 2 రూ॥లు ఈ క్రింది అడ్రసుకు మనియార్డరు చేయండి.

వై. కె. మూర్తి,
దాసరివారి వీధి, విజయవాడ-2.

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address
GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

అయి వుండవొచ్చును. కాని, మురారి తత్వం అతనికి బోధపడలేదు. అలాటి అందమైన భార్యతో బయటికి వెళ్ళడం అతనికి అంత యిష్టంగా వున్నట్టులేదు.

సుందరిని తాను పెళ్ళిచేసుకుని వుంటే?

న్యాయంగా చూస్తే మురారికన్నా శివరామ్ చాలా బాగుంటాడు.

తాను సరేఅంటే పెళ్ళి జరిగి వుండేది.

శివరామ్ నవ్వుకున్నాడు. సుందరి భర్తగా తాను ఎక్కువ సుఖపడతానని యిప్పటికీ అతనికి నమ్మకంలేదు. బహుశా మురారి ప్రవర్తనలో అంత సౌందర్యవతి యింట్లో వుంటే కలిగే చిక్కులు ప్రతిఫలిస్తున్నాయి. అయినా ఆ ఆలోచన అసందర్భం. తనకి కావలసింది రాగిణి తనకింకా దగ్గరగా రావడం.

పది దాటుతోంటే రాగిణి నించి ఫోన్ వొచ్చింది.

ఆమె గొంతుక వినగానే, "ఎక్కడికి వెళ్ళేవు రాగిణీ!" అన్నాడు వేరే ఉపోద్ఘాతం లేకుండా శివరామ్.

కొంచెం ఆగి, "మీరు లేరని అలాగ తిరగడానికి వెళ్ళేనండీ! ఏమీ తోచక సర్కస్ కూడా చూసివచ్చాను" అంది రాగిణి.

"అలాగా!...." అన్నాడు శివరామ్.

"అవును.... ఏమిటి. నన్ను అక్కడికి రమ్మన్నారట?" అంది రాగిణి.

"ఏం లేదు. ఇక్కడ రెండు మూడు రోజులు ఇంకా పనివుంది. రేపు కోరమాండల్‌లో నువ్వు రాకూడదూ- మా కొలీగ్ మురారి భార్యతో కూడావొచ్చాడు. మీ వూరే ఆమెది!"

"ఇప్పటికిప్పుడు బయలుదేరి ఎలాగ?" అంది రాగిణి. ఆమెకా ఉద్దేశం అంత రుచించినట్టులేదు.

"ఎల్లుండి మన వెడ్డింగ్ యానివర్సరీ కూడాకదా! సరదాగా వుంటుంది వచ్చీ" అన్నాడు ఉత్సాహంగా శివరామ్.

"సరే" అంది రాగిణి.

ఆ వేళలో ఏమీ ఉత్సాహం ఉన్నట్టులేదు. కాని, అది అంత ప్రత్యేకంగా శివరామ్ గమనించలేదు.

"సాయంత్రం స్టేషన్‌కి వస్తాను."

కాల్ అయిపోయింది.

రాగిణి రేపు వస్తుంది. జరిగినదంతా ఆమెకి సుందరి చెప్తుందా? కాని, సుందరికి తాను జ్ఞాపకం ఉన్నట్టే లేదు.

చూద్దాం. అని తనకి తాను చెప్పుకుని నిద్రపోయాడు శివరామ్.

మర్నాడు ఆఫీసునించే నేరుగా వెళ్ళి సకాలంలో వొచ్చిన రైలుకి మనస్సులో ధన్యవాదాలు చెప్పి రాగిణిని రిసీవ్ చేసుకుని హోటలుకి వచ్చాడు శివరామ్.

అరగంటలో తయారై మురారి గదికి టెలిఫోన్ చేశాడు శివరామ్.

"వొస్తున్నాం .... రెండు నిమిషాలు" అన్నాడు మురారి.

మరో పది నిమిషాలలో వొచ్చారు.

పరిచయాలు జరుగుతూంటే శివరామ్ చాలా జాగ్రత్తగా కనిపెట్టడంలో నిమగ్నుమైపోయాడు. రాగిణి సుందరిని గురించి ఏమీ అడగలేదు. సుందరి, రాగిణి పరస్పరం గుర్తించుకోకపోవడం గమనించాడు శివరామ్ అతనికి కొంత ఆశాభంగం కలిగింది.

పది నిమిషాలు సంభాషణ సాగేక "సినిమామాట ఏమిటి? ఈ రోజు వెడదామని అనుకున్నాంకదా?" అన్నాడు శివరామ్.

టికెట్టుమాట పూర్తిగామరిచిపోయాను బ్రదర్! సుందరికూడా ఆ విషయం జ్ఞాపకం చెయ్యలేదు" అన్నాడు మురారి.

నలుగురూ లాన్‌లో కూర్చున్నారు.

మందంగా సాగింది సంభాషణ. ఇరవై నిమిషాల తరవాత సుందరి లేచి, "నేనూ రాగిణీ రూములో ఉంటాము...." అంది.

"ఏం, రహస్యాలు ఉన్నాయా?" అన్నాడు మురారి.

ప్రశ్నగా తనవైపు చూసిన రాగిణికి జవాబుగా తలఊపి కుర్చీలో మరికొంచెం సుఖంగా జారవడ్డాడు శివరామ్. వాళ్ళిద్దరూ గదిలోకి వెళ్ళి ఏమిటి మాట్లాడుకుంటారో ఆలోచిస్తున్నాడు అతను.

పదినిమిషాలు పోయాక, "పద.... ఒక అరగంట బయటతిరిగి వద్దాము" అన్నాడు మురారి. గమ్యం అంటూ లేకుండానే ఇద్దరూ బయటికి నడిచారు.

ఏదో చెప్పాలని ఒకటి రెండు సార్లు ప్రయత్నించి ఆగిపోయాడు మురారి. అతని సందేహం గ్రహించి శివరామ్ అతన్ని బలవంత పెట్టలేదు. కాని, సుందరి అతని జీవితంలో చాలా మార్పులు తెచ్చిందని శివరామ్ గమనించలేదు. తానూ— మురారీ ఇంజనీరింగ్‌లోనూ తరవాత మేనేజిమెంటు కాలేజిలోనూ కలిసి చదువుకున్నారు. అతి సాన్నిహిత్యం లేకపోయినా, వాళ్ళమధ్య మంచి స్నేహం వుండేది. ఆ రోజుల్లో చాలా కులాసా పురుషుడుగా మురారి చలామణీఅయేవాడు. అతనెప్పుడూ నవ్వుతూ, కబుర్లు చెప్తూ వుండేవాడు. శివరామ్ స్వతహాగా అంత కలివిడి మనిషికాదు. కాలేజీ, చదువూ - తప్పితే లైబ్రరీ. ఇవేమీ కాకపోతే నడక. ప్రతీరోజూ నాలుగైదు మైళ్ళు నడిచేవాడు. రెండు మూడు రోజుల కొకసారైనా మురారి అతని రూముకి వొచ్చి ఓ అరగంట సేపు బాతాఖానీవేసుకుని వెళ్ళేవాడు.

ఎప్పుడేనా కాలేజీ విషయాలు, సబ్జెక్టులు గురించీ చర్చించేవాడు. అలాగే కొన్ని సంవత్సరాలు వాళ్ళ స్నేహం గడిచింది.

ఒకే కంపెనీలో రెండు బ్రాంచీల్లో వాళ్ళకి ఉద్యోగాలు దొరికాయి. కాని. దూరంవల్ల కొంతా, వారిది మరీ దగ్గరకాని మామూలు స్నేహం మాత్రమే కావడం వల్ల కొంతా, వాళ్ళు దూరంగానే వుండి పోయారు. ఇక్కడ మళ్ళీ కలుసుకునే దాకా. మురారి సుందరిని పెళ్ళి చేసుకోవడం విచిత్రంగా వుంది. కాని ఆ పరిస్థితుల్లో అతన్ని కదిలించి ఆ విషయం మాట్లాడించడం సభ్యతగాకాని, మంచిదిగాగాని కనిపించలేదు.

అనుకున్నకన్న ఎక్కువసేపు తిరిగి హోటల్‌కి వచ్చారిద్దరూ. మురారి రూమ్‌కి వెళ్ళేసరికి రాగిణీ, సుందరీ మంచి హుషారుగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

నలుగురూ కలిసి వెళ్ళి డిన్నర్ ముగించారు.

పది దాటుతుంటే శివరామ్ రాగిణితో కలిసి గదికి వచ్చాడు. అంతసేపు జరిగిన సంభాషణలో సుందరి ఆమెకి ఏమి చెప్పిందోనని చాలా ఉత్సుకత వున్నా. రాగిణి.ఆ విషయం ప్రస్తావించకపోడంతో అతనికి ఏమి సూచనకూడా దొరకలేదు.

"రేపు- ఉదయం మహాబలిపురం వెళ్ళి సాయంత్రం వస్తాము" అంది రాగిణి.

"గుడ్" అన్నాడు.

అంతే.

గతరాత్రి నిద్రలేదుకాబోలు. పుస్తకం చదవకుండానే నిద్రకి ఉపక్రమించింది రాగిణి. చాలాసేపటి తరవాత అతనూ నిద్రపోయాడు.

తరువాత రెండురోజులు ఆఫీసులో చాలా పని. అతనికీ, మురారికీకూడా తీరుబాటులేదు. రెండోరోజు వెడ్డింగ్ యానివర్సరీ అయింది. మంచి చీరకొనిఇచ్చాడు రాగిణికి.

"చాలా బాగుందండీ! మీకింత మంచి సెలెక్షన్ తెలుసునని అనుకోలేదు" అంది రాగిణి.

"అవును. నా సెలెక్షన్ గురించి నీకంతగా తెలీదులే!" అన్నాడు శివరామ్ చిన్న నవ్వుతో.

రాగిణి చాలా చక్కటి చిరునవ్వుతో ఏమీ అనకుండా వుండిపోయింది. ఆరాత్రి డిన్నర్ యిచ్చాడు శివరామ్. మరి కొంత మందిని పిలుద్దామని అనుకున్నా రాగిణి వారించింది. "తెలీని వాళ్ళంతా వాస్తే యిబ్బందిగా వుంటుంది. మనం నలుగురమూ చాలు" అంది.

శివరామ్ ఆ డిన్నర్ చాలా ఎంజాయ్


## ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20.000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395126

**SUPREME CORPORATION (BANKERS)**
F-15 ",EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.

## తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



తెల్ల మచ్చల నుండి విముక్తి పొందిన వేలకొలది రోగులు నుండి ప్రశంసలు అందినవి. ఇటువంటి ప్రశంసలు పొందడానికి కారణం ఏమిటంటే ట్రీట్‌మెంట్ మొదలవ్వగానే మచ్చల యొక్క రంగు మారిపోవడం మొదలవుతుంది. మరియు క్రమంగా చర్మం యొక్క రంగు వస్తూ ఉంటుంది. ఒక్కసారి సేవించిన తరువాత అది ఎంత బాగా తెలిసేమందో చూడండి. వివిధ చెందిన వేలకొలది రోగులు ఈ మందు వల్ల విముక్తి పొందారు ఇంకా పొందుతూ ఉన్నారు. ప్రచారం కోసం ఈ ప్యాకెట్ మందును ఉచితంగా ఇస్తూ ఉన్నాం. మీరు అతి పిరాలుగా నిరాశ చెంది ఉంటారు ఒక్కసారి వాడి చూడండి. ఎక్కడెక్కడ మచ్చలున్నాయో ఎంత పెద్దవో లేదా ఎన్ని రోజుల నుండి ఉన్నాయో మొదలయిన వివరాలను వ్రాయండి.

ఈ వైద్యంకోసం మందుమ ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొదలెట్టండి. **BHARAT AYURVEDASHRAM P. O. KATRI SARAI (GAYA)**

## ఊరగాయలకు అమూల్యమైన నూనెలు

అగ్‌మార్కు కాబడిన

## A. S. బ్రాండ్ పప్పు నూనె
## మేసన్ బ్రాండ్ నువ్వుల నూనె

* ఊరగాయలను మెత్తబడనీయవు. * బూజు పట్టనీయవు.
* కాలాకాలము నిల్వయుండును. * అమితముగ రుచికలుగజేయును

16, 4, 2 కేజీల డబ్బాలలో ప్యాకింగ్ చేయబడుచున్నవి.
ఇండియన్ గవర్నమెంట్ వారి అగ్‌మార్క్ సీలునుగమనించికొనుడు

డిపోలు : * దా. ఉత్కృ స్ట్రీట్ తెనాలి, ఫోన్ : 160
* 1-3-166, రాజా మొదలియార్ స్ట్రీట్.
కలాసిగుడ, సికింద్రాబాద్. ఫోన్ : 76160

బళ్ళారి, గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల, బరంపురం, కలకత్తా, జెంషెడ్‌పూర్, నాగపూర్‌లలో మాఏజెంట్లు కలరు.

Manufacturers స్థాపితం : 1916

## అంబటి సుబ్బన్న & కో., సామర్లకోట

ఇండియాలో కెల్లా పెద్ద అగ్‌మార్కు జింజిలీ ఆయిలు ప్యాకర్సు

చేశాడు. దానికి ముఖ్యమైన కారణం రాగిణి. ఒక్కసారి ఆమెలోకి జీవం వొచ్చినట్టు కనిపించింది. ఆమెని యిక్కడికి పిలవడం చాలా మంచిపని చేశాననుకున్నాడు శివరామ్. కాని, అతనికి ఒకటే ఆలోచన. ఆమె సుందరితో మాట్లాడినప్పుడు జరిగినదంతా తెలుసుకుందామని. దాన్ని గురించి రాగిణిని అడిగే ప్రసక్తి లేదు. ఆమె స్వయంగా చెప్పాలి. ఈ రోజు తానెప్పుడూ చూడనంత ఉత్సాహంగా ఉన్నా, ఆమె ఆ విషయం గురించి ప్రస్తావిసుందని అతనికి నమ్మకలేదు.

మర్నాడు పని ముగిసింది. శివరామ్ తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేశాడు. కాని రాగిణి "ఒకసారి బెంగుళూరు వెళ్ళి అక్కడినించి పోదాం" అంది.

బెంగుళూరులో రాగిణి అన్నా, చెల్లెలూ కూడా వున్నారు.

కొంచెం ఆలోచించి "నువ్వు వెళ్ళిరా. నేనుకూడా ఎందుకు?" అన్నాడు శివరామ్. వాళ్ళెవరూ అంతగా పరిచయం లేదతనికి.

"మీరు ఒక్కసారి రావాలని వాళ్ళకి చాలా కోరికగా వుంది. ఈ రెండేళ్ళలోనూ చాలాసార్లు రాశారు. ఒక్కరోజు ఉండి వెళ్ళిపోదాం" అంది రాగిణి. ఆమె చాలా మారిపోయింది అనిపించింది శివరామ్‌కి. తమ వైవాహిక జీవితంలో ఏదైనా ఆమె కోరడం అదే మొదటిసారి.

"సరే అలాగే" అన్నాడు. అది మనసులో పెట్టుకుని శివరామ్.

కాని, అతను టికెట్లు మార్చేలోగా రాగిణి మనసు మార్చుకుంది.

"ఇంటికే పోదామండీ! బెంగుళూరు మరెప్పుడైనా వెడదాం" అంది.

"ఏం? ఎందుకు హఠాత్తుగా మనసు మార్చుకున్నావు?" అన్నాడు శివరామ్ ఆశ్చర్యపడి. ఈ అరగంటలో రాగిణి సుందరిని తప్పిస్తే మరెవరినీ కలియలేదు.

"ఏం లేదు. ఇంటికి పోదాం."

మర్నాడు గుడ్‌బై చెప్తూ మురారి తానూ సుందరీ రెండు రోజులు బెంగుళూరు వెళ్తున్నామని చెప్పాడు. శివరామ్ ఈసారి తీవ్రమైన ఆలోచనలో పడ్డాడు. కాని, అతనికి ఏమీ బోధపడడంలేదు.

తిరిగి వచ్చాకమరో వారంరోజులు గడిచాయి.

రాగిణిలో ఉత్సాహం, ఆనందం తక్కువ కాలేదు. రోజు రోజుకీ ఆమెలో అవి ఎక్కువ అవుతూ వచ్చాయి.

రెండేళ్ళు కిందటకాక, రెండో యానివర్సరీకి వాళ్ళ పెళ్ళి అయినట్టు ఉంది. కొత్తకాపురంలాగ ఉంది జీవితం.

ఇంతకాలంనించి ఆమెలో అతను ఆశించి, నిరాశపడ్డ స్పందన ఆమెలో ప్రతి రోజూ కనిపిస్తోంది.

ఆమెనెన్నో ప్రశ్నలడగాలని ఉంది శివరామ్‌కి. కాని, ఈ కల అలాటి ప్రశ్నలతో కరిగిపోతుందేమోనని అతనికి భయం.

అతి కష్టంతో ఆ వారంరోజులూ గడిపేడు.

ఆ ఆదివారం అతనికి అనుకోకుండా పని తగిలింది. సాయంత్రందాకా ఆఫీసులో ఉండి చీకటిపడుతోంటే వచ్చాడు.

రాగిణి చాలా బాధపడిపోయింది.

అంతకుముందు అతను సెలవలలోనూ ఆ సమయాలలోనూ పని వుండి వెళ్ళడం కొత్తకాదు. కాని, రాగిణి బాధపడిపోవడమే కొత్త.

అతను సంతోషంగా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతారు?" అంది రాగిణి టీ తెచ్చి ఇస్తూ.

"నీ బాధ చూసి" అన్నాడు శివరామ్ నిజం చెప్తూ.

"అందులో నవ్వడానికేం వుంది?"

"సంతోషం."

"ఎందుకని?"

"నీకూ తెలుసును— నాచేత చెప్పించుకోవాలని వుందా?"

"ఉంది" అంది రాగిణి చక్కటి చిరునవ్వుతో.

"నాకోసం నువ్వు అలాగ బాధపడడం చాలా తియ్యగా వుంది" అన్నాడు టీ చప్పరిస్తూ.

"నాకలాగ బాధపడడమూ తియ్యగా వుంది" అంది రాగిణి అతనివైపు చూడకుండా ముచ్చటగా సిగుపడుతూ.

పరిస్థితి తియ్యగా వుంది.

నిశ్శబ్దంగా టీతాగి, "నిన్నొకటి అడగాలని వుంది" అన్నాడు శివరామ్.

"ఏమిటి?"

"సుందరిని చూశావు కదా! ఆమెని గురించి ఏమనుకున్నావు?"

కొంచెం సంశయించింది రాగిణి.

"పరవాలేదు చెప్పు. ఆమె చాలా అందంగా వుంటుంది కదా?"

"అవును- కాని...."

"ఏమిటి?"

"పాపం! ఆమె సుఖపడడంలేదు."

"ఏం?"

"మీ ఫ్రెండు మురారి మరీ అనుమానం మనిషట. అందుకే ఆమెనికూడా తీసుకొచ్చాడు."

"అలా ఎందుకనుకోవాలి? అభిమానంతో అయి వుండవొచ్చు. నేను నిన్ను రమ్మనలేదూ?"

"మీ మాటవేరు." అని ఆగిందిరాగిణి. "మిమ్మల్నీ ఒకటి అడిగేదా?"

అదేమిటో అతనికి తెలుసును. "అడుగు" అన్నాడు.

"సుందరిని - ఎందుక్కాదన్నారు? నా కన్నా చాలా బాగుంటుంది!"

"కాదన్నానని - నీకెలాగ తెలుసును? సుందరి చెప్పిందా?"

"లేదు- నేనే సుందరికి చెప్పేను. సుందరికి మీరే ఆనాడు వొచ్చారనితెలీదు. తల వొంచుకుని కూర్చుందిట. మీరు కాదన్నాక, మీ మాట పూర్తిగా మరిచిపోయింది."

"నిజంగా?"

"అవును- ఆమెని చూడ్డానికి అప్పటికి అయిదారుగురో ఎక్కువో వచ్చారు...."

"మరి నీకెలాగ తెలుసును?"

"మా నాన్న చెప్పేరు. మీరు వొచ్చి చూసినా, మా వాళ్ళకెవరికీ ఆశలేదు. ఆ అందం నాకు లేదు.... వాళ్ళ ఆస్తి మా నాన్నకి లేదు...."

శివరామ్ నవ్వేడు.

"నాకు అందం, ఆస్తే కావాలనుకున్నారన్నమాట!"

"అది సహజంకదా!"

"పోనీలే. అసహజంగా నిన్ను ఎంచుకున్నాను.... కాని.... నువ్వే చాలాకాలం దూర దూరంగా ఉండిపోయావు" అన్నాడు శివరామ్ ఆమెని దగ్గరగా తీసుకుంటూ.

"కాని.... సుందరిని కాదని నన్నెందుకు సెలెక్ట్ చేసుకున్నారు?" అని సూటిగా అడిగింది.

"అది మాటల్లో చెప్పడం కష్టం."

"జాలిపడ్డారా?" అంది చిత్రంగా చూస్తూ రాగిణి.

"లేదు" దృఢంగా అన్నాడు శివరామ్.

"కాని, ఆమెని చూశాక నేను వంద వోల్టుల దీపం తరవాత చిన్న నూనె దీపంలాగ కనిపించి వుంటాను."

మళ్ళీ నవ్వేడు శివరామ్.

"చాలాసార్లు వంద వోల్టులు భరించలేము రాగిణీ! చిన్న దీపం కళ్ళకి చల్లగా మనసుకి చల్లగా వుంటుంది."

"అవునండీ! అదీ నిజమే!" అంది రాగిణి సాలోచనగా. ఆమెకి కొంత అర్థం అయినటు వుంది.

అతనికీ కొంత అర్థం అయింది.

కాని యిద్దరిలోనూ లోలోపల కొత్త కొత్త ఆలోచనలు వొస్తున్నాయి. అవి చాలాకాలం వరకూ వొస్తూనే వుంటాయి.

మరి దీపంవుంటే దానికిందనో, మీదనో చీకటీ తప్పదు.